క్లుప్తంగా

దళితుల సమస్యలు పరిష్కరించాలి



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న దళితుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య అన్నారు. ఎంపీ పోరిక బలరాంనాయక్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. దళితులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనకు కృషి చేయాలని, విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో శ్రీను, రాధా, సుధా, దేవి, ఉపేందర్, నవీన్, భాస్కర్, బాలారాజు పాల్గొన్నారు.

ఇంటి నంబర్లు కేటాయించాలి

నెహ్రూసెంటర్: పట్టణంలో ఇల్లు నిర్మించుకున్న ప్రతీ ఒక్కరికి ఇంటి నంబర్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు అల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, యాకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



మరిపెడ రూరల్: గురువందనం కార్యక్రమంలో భాగంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మరిపెడ మోడల్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు లూనావత్ శంకర్‌ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఘనంగా సన్మానించి అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, వాణిదేవి పాల్గొన్నారు.

విరాళం అందజేత



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీమహాగాయత్రి అమ్మవారి దేవాలయ పురోభివృద్ధి కార్యక్రమాల కోసం పట్టణానికి చెందిన రిటైర్డ్ ఇంజనీర్ పరకాల విజయపాల్ రెడ్డి, రమ దంపతులు ఒక లక్ష పదహారు రూపాయలను మంగళవారం ఆలయ ప్రధాన పూజారి వంకోజు జలేంద్రాచార్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పరకాల శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రింటర్ బహూకరణ

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న చింతల ప్రశాంతి పాఠశాలకు ప్రింటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రుక్మాంగధరరావు, హెచ్‌ఎం విత్తనాల సుధాకర్, విజయపాల్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అరుణ, ఉపాధ్యాయులు ఇందిరారాణి, విక్టోరియా, లక్ష్మి, విజయ కుమారి, మాధవి పాల్గొన్నారు.

తండ్రిపై గొడ్డలితో కుమారుడి దాడి

కురవి: భూవివాదంలో కొడుకు తండ్రిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన సీరోలు మండలం చింతపల్లి శివారు కొత్త తండాలో మంగళవారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త తండాకు చెందిన బానోత్ భీమాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు సాగర్‌కు పెళ్లి కాకపోవడంతో తండ్రి భీమా అతని వద్ద ఉంటున్నాడు. భీమా కుమారులిద్దరి మధ్య గతంలో భూతగాదాలు జరిగాయి. ఈ క్రమంలో పెద్ద కుమారుడు స్వామి తన పంటకు నీరు పెట్టేందుకు బావికి వద్ద విద్యుత్ మోటార్ ఆన్ చేశాడు. విషయం తెలుసుకున్న తండ్రి భీమా బావి వద్దకు వెళ్లి విద్యుత్ మోటార్‌కు ఉన్న స్టార్టర్ బాక్స్‌ను తీసుకుని ఇంటికి వచ్చాడు. స్టార్టర్ బాక్స్‌ను ఎందుకు తీసుకొచ్చావని స్వామి.. తండ్రిని నిలదీశాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తండ్రి భీమా, చిన్న కొడుకు సాగర్, పెద్ద కొడుకు స్వామికి మధ్య గొడవ తీవ్రమైంది. ఈ క్రమంలో తండ్రి భీమా.. స్వామిపైకి గొడ్డలి విసిరాడు. దీంతో ఆగ్రహానికి గురైన స్వామి అదే గొడ్డలితో తండ్రి భీమాను కొట్టి గాయపరిచాడు. స్థానికులు భీమాను అంబులెన్స్‌లో మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతున్నాడు. ఇదే విషయమై సీరోలు ఎస్సై నగేశ్‌ను వివరణ కోరగా కొత్త తండాలో జరిగిన గొడవ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని తెలిపారు.

జాగ్రత్తలే శ్రీరామరక్ష

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం
- సీజనల్ వ్యాధులకు నీరు, ఆహార పదార్థాల కలుషితమే ప్రధాన కారణం
- జాగ్రత్తలు పాటించాలని వైద్యులు, అధికారుల సూచన



రేక్యతండాలో సీజనల్ వ్యాధులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మరిపెడ రూరల్: వానాకాలం వ్యాధులు సీజన్‌లో విషజ్వరాలు ముప్పేట దాడి చేస్తుంటాయి. పరిసరాలు పరిశుభ్రత పాటించకపోవడం, వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉంది. ఫలితంగా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వీటి నివారణకు వైద్యాధికారులు, అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని పారుశుద్ధ్యంపై అధికారులు దృష్టి సారించారు.

సీజనల్ వ్యాధుల లక్షణాలు

డెంగీ

వైరల్ జ్వరం మాదిరి హఠాత్తుగా జ్వరం వస్తుంది. తీవ్రమైన ఒళ్లు నొప్పులు ఉంటాయి. ఎముకలు విరిగిపోతున్నంత బాధ కలుగుతుంది. పొట్ట, కాళ్లు, చేతులు, ముఖం, వీపు భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమించే అవకాశం ఉంటుంది. ఈ దోమ పగటి పూట కుడుతుంది.

టైఫాయిడ్

జ్వరం అధికంగా ఉండి తగ్గకపోవడం, విపరీతమైన చెమట, విరేచనాలు, కడుపునొప్పి, అలసట, ఆకలి లేకపోవడం, మలబద్ధకం, చర్మంపై దద్దుర్లు, దగ్గు, వంటి లక్షణాలు కనిపిస్తాయి. కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల ఈ వ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందుతుంది.

చికున్‌గున్యా

దోమకాటు వల్ల చికున్‌గున్యా వస్తుంది. తీవ్రమైన జ్వరం, కీళ్లనొప్పులు లక్షణాలు. ఇది సోకితే మొదటి రెండు, మూడు రోజులు జ్వరం ఎక్కువగా ఉంటుంది. వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుంది.

మలేరియా

తీవ్రమైన తలనొప్పి, వణుకుతో కూడిన అధిక జ్వరం మలేరియా వ్యాధి లక్షణాలు. మలేరియా జ్వరం తగ్గిన తర్వాత మళ్లీ వస్తుంది. 14రోజుల తర్వాత అధిక జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్న వర్షపు నీటిలో వృద్ధి చెందుతాయి.

దోమలకు ఆవాసాలివే..

వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం దోమలే. ఇళ్ల పరిసరాల్లో మురుగు గుంతలు, నీటి కుండీలు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, మట్టి, ప్లాస్టిక్ పాత్రలు, ఇతర ఖాళీ వస్తువులు, టైర్లలో రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమలు వాటిలో చేరి గుడ్లు పెట్టే అవకాశం ఉంది. దోమలు లార్వా వేగంగా వృద్ధి చెందుతుంది. వీటి వల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్ విష జ్వరాలు ప్రబలుతుంటాయి. వాతావరణం మార్పులతో అతిసారం వంటి వ్యాధులకు గురవుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. జ్వరం వచ్చి ఇబ్బందులు పడేకంటే ముందస్తు జాగ్రత్తలు ముఖ్యమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచిస్తున్నారు.

వేడి ఆహారం తీసుకోవాలి



మనం తినే ఆహారం వేడిగా ఉండేలా చూసుకోవాలి. నిల్వ ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇంటి పరిసరాల్లో నీటి గుంతల వద్ద బ్లీచింగ్ పౌడర్, దోమలు వృద్ధి చెందకుండా మందులు స్ప్రే చేయాలి. ఇంటి పరిసరాలకు శుభ్రంగా ఉంచుకోవాలి

– గుగులోతు రవి, పీహెచ్‌సీ వైద్యుడు

స్పందించకుంటే సస్పెన్షన్ తప్పదు

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: ప్రజలు సమస్యలతో వచ్చినప్పుడు స్పందించి సంబంధిత అధికారులు పరిష్కారం చేయాలని, పట్టించుకోకుంటే సస్పెన్షన్ వేటు తప్పదని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మండలస్థాయి అధికారుల సమీక్ష సమావేశం మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఒకనెల సమావేశంలో చర్చించిన అంశాలపై మరో నెలలో జరుగనున్న సమావేశంలో నివేదిక అందజేయాలన్నారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు మెరుగైన సేవలు అందించాలన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని, సంబంధిత సిబ్బంది ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుంటే తనకే ఫోన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ అలివేలు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘుపతిరెడ్డి, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, పీఆర్ డీఈ రాజశేఖర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏజెన్సీ జర్నలిస్టులకు ఇళ్లు మంజూరు చేయిస్తా

గూడూరు: ఏజెన్సీ మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంజీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల ప్రథమ మహాసభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, మండల అధ్యక్షుడు గుర్రపు యాకాంబ్రం, జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, శ్రీహరి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, పాపయ్య పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

నెల్లికుదురు: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందుతుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో మంగళవారం గ్రామస్తుడు ఏర్పాటు చేసిన రేణుకా ఎల్లమ్మ మినరల్ వాటర్ ప్లాంటును స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. గ్రామంలో అనారోగ్య బారిన పడిన బైరు వెంకటేశ్వర్లుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో బండారు శ్రీనావాస్, నాయకులు పాల్గొన్నారు.

‘టీ సేఫ్’ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: మహిళలు, యువతులు, విద్యార్థినులు ప్రయాణిస్తున్నప్పుడు తమ మొబైల్ ఫోన్‌లో తప్పనిసరిగా టీ సేఫ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఎస్సీ హాస్టల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఆనంద్, కానిస్టేబుల్ అరుణ, పార్వతి, సాహితి, సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి వేతనాల చెల్లింపు

కేసముద్రం: కేసముద్రం విలేజ్ జీపీకి చెందిన సిబ్బందికి చెల్లించాల్సిన ఒక నెల వేతనాన్ని మంగళవారం పంచాయతీ కార్యదర్శి మధుమోహన్ నాయుడు అందజేశాడు. 2023 నవంబర్ నెలకు సంబంధించిన రూ.2.17లక్షల వేతనాన్ని కార్యదర్శి సొంతానికి వాడుకున్నారంటూ ఇటీవల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ సిబ్బంది ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీపీ సిబ్బందికి రూ.1.12లక్షల వేతనాలను మంగళవారం కార్యదర్శి చెల్లించాడు. మిగిలిన మొత్తాన్ని గతంలోనే చెల్లించినట్లు ఆయన తెలిపాడు.

ఘనంగా శ్రీకృష్ణుడి శోభాయాత్ర



పెద్దవంగర: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

పెద్దవంగర: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని త్రైత సిద్ధాంత జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుని పల్లకీ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. పలు వీధుల గుండా భగవద్గీత పఠనశ్లోకాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళహారతులు పట్టి కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు, తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేస్తారు. కార్యక్రమంలో ప్రబోధ సమితి సభ్యుడు కైతోజ్ గణేశ్ శర్మ, కమిటీ సభ్యులు ఉడుత సంపత్, బొమ్మెరబోయిన సుధాకర్, జమ్ముల యాకయ్య, తమ్మి అశోక్, ధారం మధు, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామివారికి పూజలు

మహబూబాబాద్ రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయంలో మంగళవారం శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

కృష్ణాష్టమి వేడుకలు

గార్ల: గార్లలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలను మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 108 పర్యాయాలు విష్ణు సహస్రనామం పఠించి భజనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అర్చకుడు అచ్యుత్‌స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

పెండింగ్‌లో ఆర్టీసీ కార్మికుల సమస్యలు



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

తొర్రూరు: ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తొర్రూరు ఆర్టీసీ జేఏసీ నాయకులు ఎంకే రావు, ఎన్‌వీఎం చారి కోరారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మంగళవారం తెల్లవారు జామున డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, పెండింగ్ పీఆర్‌సీలు, బాండ్ మొత్తాలు చెల్లించాలని కోరారు. ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు యాదగిరి, స్వామి, పద్మ, రమేష్, పీఎస్ రెడ్డి, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



కురవి: ఆర్థికసాయం చేస్తున్న సత్యనారాయణ

కురవి: మండల కేంద్రానికి చెందిన స్నేహ గ్రామైక్య సంఘం సీఏ సరిత కుటుంబానికి ఐకేపీ సీసీలు, సీఏలు, వీఓఏలు అంతా కలిసి రూ.32,500ల ఆర్థిక సాయాన్ని ఐకేపీ ఏపీఎం సత్యనారాయణ మంగళవారం అందజేశారు. సరిత భర్త దుర్గాకుల సత్యనారాయణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కార్యక్రమలో ఏపీఎం సత్యనారాయణ, సీసీలు సతీష్, రామారావు, ఇందిరా, కృష్ణయ్య, వీఓఏలు పాల్గొన్నారు.

రూ.2వేల ఆర్థికసాయం, బియ్యం అందజేత

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామానికి చెందిన ఈశ్వర్‌సింగ్ అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు మంగళవారం గ్రామానికి చెందిన ఇంటికన్నె హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.2వేల ఆర్థికసాయం, 50కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నలమాస సందీప్, ఉపాధ్యక్షుడు షరీఫ్, కార్యదర్శి బోళ్ల హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

నిధుల స్వాహాపై విచారణ జరిపించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: సీఎంఆర్‌ఎఫ్ నిధుల స్వాహాపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ నిధులను స్వాహా చేసిన అధికారులు, ఆస్పత్రులు, మాజీ ఎమ్మెల్యేపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, రవీందర్, జ్ఞానేశ్వర్, మంద శంకర్, నక్క నాగార్జున పాల్గొన్నారు.

‘గ్రామాల్లో బీజేపీ బలోపేతం’



కురవి: మాట్లాడుతున్న పెంటయ్య

కురవి: మండలంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొణతం పెంటయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, కృష్ణ, వెంకన్న, రెడ్డి, నరేందర్, రాంజీ, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

డోర్నకల్: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తరువాత రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలం పెరిగిందని బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు సిరికొండ సంపత్ తెలిపారు. స్థానిక జైన్‌భవన్‌లో మంగళవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దేవా, షేక్ రెహమాన్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: పార్టీ బలోపేతమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు నిర్వహించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తుంపిళ్ల శ్రీనివాస్ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఇద్దరిపై కేసు నమోదు

చిన్నగూడూరు(నర్సింహులపేట): గుడుంబా తయారీ, బెల్లం అమ్మకం ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు నర్సింహులపేట పోలీసులు మంగళవారం తెలిపారు. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేట మండలంలోని రూప్లాతండా(సబ్‌స్టేషన్ తండా)కు చెందిన గుగులోత్ మోహన్ మండల కేంద్రం శివారులోని పెద్దగుట్ట సమీపంలో గుడుంబా తయారు చేసి విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. 500లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అంతేగాకుండా మండలంలోని వస్రం తండా జీపీ పరిధిలోని గ్యాంగ తండాకు చెందిన గుగులోతు చెన్నయ్య ఇంట్లో తనిఖీలు చేయగా రెండు క్వింటాళ్ల బెల్లం లభ్యమైనట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భర్త, అత్తామామలపై..

గార్ల: భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తు న్న భర్త, అత్తామామలపై కేసు నమోదైన సంఘటన మంగళవారం పుల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం పుల్లూరు గ్రామానికి చెందిన ఉప్పాల నవ్య, చంద్రప్రకాశ్‌లకు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. చంద్రప్రకాశ్ మహబూబాబాద్‌లోని ఎస్‌బీఐ బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. వీరి కి ఒక కూతురు ఉంది. పాప పుట్టిన నాటి నుంచి భార్యను అదనపు కట్నం కోసం భర్త, అత్త జ్యోతి, మామ భిక్షమయ్య తరచూ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నా రు. వీరి వేధింపులు భరించలేక నవ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్సై జీనత్‌కుమార్ భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఒకరి బైండోవర్

నెల్లికుదురు: తహసీల్దార్ ఎదుట ఒకరిని బైండోవర్ చేసినట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు మంగళవారం తెలిపారు. ఇనుగుర్తి మండలం మీఠ్యతండాకు చెందిన జి.శంకర్ గతంలో నల్లబెల్లంతో పట్టుబడగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈనెల 26న నల్ల బెల్లంతో మళ్లీ పట్టుబడగా తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రిన్సిపాల్‌కు సన్మానం

డోర్నకల్: ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్న స్థానిక బ్రిలియంట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ అఫ్సర్ బేగంను పాఠశాల యాజమాన్యం మంగళవారం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వక్కంతుల అప్పారావుతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ స్టార్టర్ డబ్బా చోరీ

దంతాలపల్లి: మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో గ్రామపంచాయతీ బావి స్టార్టర్ డబ్బాను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది మంగళవారం తెలిపారు. డబ్బాలో స్టార్టర్, ఫీజులు, ఆటోమెటిక్ స్టార్టర్ ఉండడంతో డబ్బాను ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి మల్లికార్జున్ తెలిపారు.

దరఖాస్తు కౌంటర్లు ప్రారంభం

గూడూరు: మండలంలో ప్రభుత్వం ప్రకటించిన రూ. 2లక్షల రుణమాఫీ కాని రైతుల కోసం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఏఓ అబ్దుల్ మాలిక్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చరణ్, సుమంత్, మహేశ్, వినయ్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన వాయిదా

గార్ల: మర్రిగూడెం వేంకటేశ్వరస్వామి దేవాయలంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమం వాయిదా వేసినట్లు దేవాలయం ఈఓ నందనం కవిత మంగళవారం తెలిపారు.

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ మంగళవారం దర్శించుకున్నారు. ఆయన జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, వేణు, శ్రీహరి, రవి, సీతారాంగౌడ్, సహదేవ్ పాల్గొన్నారు.

సన్మానం

గార్ల: రాంపురం మాజీ ఎంపీటీసీ, గార్ల మండల మాజీ వైస్‌ఎంపీపీగా పనిచేసిన కట్టిబోయిన శ్రీనివాసరావులను మద్దివంచ గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు కలిసి మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబూరావు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సీతారామయ్య, కార్యదర్శి సురేందర్, భీముడు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక కమిటీ ఎన్నిక



రామ్మోహన్, అధ్యక్షుడు

మరిపెడ: జనవిజ్ఞాన వేదిక మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బయగాని రామ్మోహన్, ప్రధాన కార్యదర్శిగా అయినాల నవీన్, కోశాధికారిగా లాల్‌చంద్, ఉపాధ్యక్షుడిగా అనుములు సుధాకర్, జనార్దనాచారి, గౌరవ సలహాదారులు జర్పుల కాలునాయక్, గౌరవ అధ్యక్షుడు మందాడి రాంచంద్రులను ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణ అధికారుడిగా మహబూబాబాద్ జిల్లా జేవీవీ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దాయానంద్, కోశాధికారి సాహితి శ్రీనివాస్ వ్యవహరించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



నెహ్రూసెంటర్: షరతులు లేకుండా ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో రుణమాఫీ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెల్లూరి నాగేశ్వర్‌రావు, మేక వీరన్న, చింతకుంట్ల వెంకన్న, పెరుగు కుమార్, నవీన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు తహసీల్దార్ కోడిచింతల రాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 15 రోజులుగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై రెవెన్యూ అధికారులు దాడులు చేసి మొత్తం 16 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. మొదటిసారిగా పట్టుబడిన ట్రాక్టర్లకు రూ.5వేల వరకు జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు.

నేడు సమగ్ర శిక్ష ఉద్యోగుల ర్యాలీ

మహబూబాబాద్ అర్బన్/మరిపెడ రూరల్: రాష్ట్రంలో ఉన్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ నేడు చేపట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని జేఏసీ అధ్యక్షుడు వీరన్న పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. రవి, గణేష్, సాగర్, దర్గయ్య, సీఆర్‌పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి


బయ్యారం: ఈనెల 31, వచ్చే నెల 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న పీఓడబ్ల్యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షురాలు బొల్లం సోమక్క పిలుపునిచ్చారు. మండలంలోని వెంకట్రాంపురంలో మంగళవారం పీఓడబ్ల్యూ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సీఎంను కలిసిన పిల్లి సుధాకర్



నెహ్రూసెంటర్: సీఎం రేవంత్‌రెడ్డిని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మంగళవారం కలిశారు. ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలని విన్నవించినట్లు ఆయన తెలిపారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



గార్ల: పొట్టకూటి కోసం సంచార జీవనం కొనసాగిస్తున్న బుడిగ జంగాల కులస్తుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. మండలంలోని గుంపెళ్లగూడెం గ్రామంలో నివసిస్తున్న బుడిగ జంగాలకు ఇళ్లు లేవని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలన్నారు. కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవీందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరినాయక్, పెద్దవెంకటేశ్వర్లు, రాజారావు పాల్గొన్నారు.